


ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 316 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | బుధవారం18 జూన్ 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# దౌత్యవేత్తల పునర్ నియామకానికి భారత్, కెనడా అంగీకారం

**భారత ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ భేటీ అయి పలు కీలక అంశాలపై చర్చించారు.**

**జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): రెండేళ్లుగా పతనమవుతూ వస్తోన్న భారత్- కెనడా ల మధ్య సంబంధాలు బలపడే దిశగా అడుగులు పడుతున్నాయి. జీ7 సదస్సుల్లో పాల్గొనేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ కెనడా వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ పర్యటన నేపథ్యంలో ఆయన ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల సంబంధాల బలోపేతానికి సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చలు జరిపారు.**

ఈసందర్భంగా దౌత్యవేత్తల పునర్ నియామకంపై ఏకాభిప్రాయం కుదిరింది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు తీసుకున్న దౌత్యపరమైన చర్యల్లో ఇది మొదటిదని ఆయన పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య నిలిచిపోయిన వాణిజ్య చర్చలకు సంబంధించిన విషయంపై కూడా ఇరువురూ చర్చించుకున్నారని తెలిపారు. పరస్పర గౌరవం, చట్ట నియమాలకు కట్టుబడి ఉండటంతో సహా ఇరుదేశాలలోని పౌరులు, వ్యాపారులకు సాధారణ సేవలు తిరిగి అందించే ఉద్దేశంతో దౌత్యవేత్తల పునర్ నియామకానికి మోదీ, కార్నీలు అంగీకరించారని కెనడా ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఓ ప్రకటనలో పేర్కొంది. దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్-కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల దెబ్బతిన్నాయి. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించారు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. ఈ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. దీంతో ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను వెనక్కి పంపించాయి. ఈ క్రమంలో ఇటీవల ఆ దేశంలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కార్నీ భారత్తో తిరిగి సంబంధాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు.




# కిడ్నాప్ కేసులో ఏడీజీపీ అరెస్టు.. సుప్రీంకోర్టు సీరియస్

**కిడ్నాప్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఏడీజీపీ జయరామ్ను తమిళనాడు ప్రభుత్వం సస్పెండ్ చేయడం తమను షాక్కు గురిచేసిందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.**



**ఢిల్లీ, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): తమిళనాడులో ప్రేమ వ్యవహారానికి సంబంధించి ఓ యువకుడి కిడ్నాప్ వ్యవహారం తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కేసులో మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఏడీజీపీ జయరామ్ను అరెస్టు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఓ సీనియర్ పోలీసు అధికారి విచారణలో పాల్గొన్నందుకు ఆయనను ఎలా సస్పెండ్ చేస్తారంటూ తమిళనాడు సర్కారును ప్రశ్నించింది. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది.**

## అసలేం జరిగిందంటే..?

తిరువళ్లూరు జిల్లా కళంబాక్కంకి చెందిన యువకుడు ఇటీవల తేనికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ఆ యువకుడి 16 ఏళ్ల సోదరుడు కిడ్నాప్ అయ్యాడు. ఈ వ్యవహారంలో ఏడీజీపీ జయరామ్కు సంబంధం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి ఇటీవల విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు.. ఏడీజీపీని అరెస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఏడీజీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అరెస్టయిన వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఏడీజీపీ హోదాలో ఉన్న తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ పిటిషన్పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ కౌన్సిల్ వాదిస్తూ.. ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారణ అనంతరం మంగళవారం సాయంత్రమే విడుదల చేశామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే, తనను పోలీసులు విడుదల చేసినప్పటికీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిందని తెలిపారు. దీంతో సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. "ఆయనో సీనియర్ పోలీసు అధికారి. సస్పెన్షన్లో పెట్టాల్సిన అవసరం ఏముంది? ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు దిగ్భ్రాంతి కలిగించాయి. నిరుత్సాహపరిచేలా ఉన్నాయి" అని కోర్టు ఆగ్రహించింది. గురువారం నాటికి ఆ అధికారిపై సస్పెన్షన్ రద్దు చేసి.. ఆ సమాచారాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది.

# గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం - సీఎం రేవంత్

**ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.**

హైదరాబాద్, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్ రెడ్డిఅన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ను (జీఎస్ఈసీ) ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు.



"గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోంది. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలి. తెలంగాణ రైజింగ్లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ

**కేంద్ర హోంమంత్రి అమిత్తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు.**





ఢిల్లీ, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. సుమారు 25 నిమిషాల పాటు భేటీ కొనసాగింది. రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. సాయంత్రం మరికొందరు కేంద్రమంత్రులతో లోకేశ్ సమావేశం కానున్నారు. చిరాగ్ పాసవాన్, అర్జున్రామ్ మేఘ్వాల్ను ఆయన కలవనున్నారు. బుధవారం ఉదయం ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్తో భేటీ ఆయన భేటీ అయిన సంగతి తెలిసిందే.

# పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదు:భట్టి విక్రమార్క

**ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ కోసం రూ.13,992 కోట్లు చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.**



ఖమ్మం, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): ప్రజలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ కోసం రూ.13,992 కోట్లు చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆయన విద్యుత్ అంబులెన్స్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. వరదల సమయంలో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణకు ప్రాణాలకు తెగించి పనిచేశారని అభినందించారు. పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త విద్యుత్ ప్రాజెక్టు నిర్మించలేదని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుల ద్వారానే విద్యుత్ సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు.

# చెవిరెడ్డిని విజయవాడకు తీసుకొచ్చిన సిట్ అధికారులు

**ఏపీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని సిట్ అధికారులు విజయవాడకు తీసుకొచ్చారు.**

విజయవాడ, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని సిట్ అధికారులు విజయవాడకు తీసుకొచ్చారు. బెంగళూరులో మంగళవారం ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విజయవాడ సిట్ కార్యాలయంలో విచారణ అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. చెవిరెడ్డితో పాటు అరెస్టయిన ఆయన సన్నిహితుడు వెంకటేశ్నాయుడిని కూడా నగరానికి తీసుకొచ్చారు.



వైకాపా హయాంలో జరిగిన రూ. వేల కోట్ల మద్యం కుంభకోణం కేసుపై సిట్ అధికారులు విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి కొల్లగొట్టిన సొత్తులో కొంత మొత్తాన్ని గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు చేరవేసినట్లు దర్యాప్తులో సిట్ గుర్తించింది. ఈ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా చెవిరెడ్డి భాస్కర్రెడ్డి వ్యవహరించారు. ఈ ముడుపుల సొమ్మును కలెక్షన్ పాయింట్లకు చేరవేయడంలో ఆయన బాల్యమిత్రుడు, సన్నిహితుడు వెంకటేశ్ నాయుడు కీలకపాత్ర పోషించినట్లు తేల్చింది. వీరిద్దరూ బెంగళూరు నుంచి శ్రీలంకకు పారిపోతుండగా విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు మంగళవారం ఉదయం అడ్డుకున్నారు. చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడిపై లుక్ అవుట్ సర్క్యులర్లు ఉండడంతో వారిద్దరినీ అక్కడే నిర్బంధించి ఆ సమాచారాన్ని సిట్ అధికారులకు తెలిపారు. సిట్ బృందాలు బెంగళూరు వెళ్లి, మంగళవారం రాత్రి వారిద్దరినీ అరెస్టు చేశాయి. వీరి అరెస్టుతో మద్యం కుంభకోణంలో అరెస్టయిన నిందితులు సంఖ్య తొమ్మిదికి చేరింది.

# ఉత్తమ్ కుమార్ రెడ్డి సగం కాంగ్రెస్..

## సగం భారాస: ఎంపీ ధర్మపురి అర్వింద్

**బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పామంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.**

హైదరాబాద్, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పామంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి పల్లెలో కాంగ్రెస్ ఇమేజ్ భూస్థాపితం అయింది. ఉత్తమ్కుమారెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్లో తెలంగాణ సెంటిమెంట్ను రెచ్చగొట్టేందుకు ఆయన చేస్తున్న పని పవర్ పాయింట్ ప్రజంటేషన్. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే నాటకాలాడుతున్నారు. భాజపాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. నన్ను సిట్ పిలవలేదు. మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదు" అని అర్వింద్ వ్యాఖ్యానించారు.



# ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం:షర్మిల

**తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది వాస్తవం అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు.**

**విశాఖ, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది పచ్చి నిజమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. తన ఫోన్తో పాటు భర్త, దగ్గర వాళ్ల ఫోన్లను ట్యాప్ చేశారని షర్మిల ఆరోపించారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధరించారు.**

ఆనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మన్నా వస్తా. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్రెడ్డి, చంద్రబాబు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలి. ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయింది. ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో నన్ను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఆ ఇద్దరు కలిసి వేసిన స్కెచ్.

### కేసీఆర్ కోసం జగన్ నన్ను తొక్కిపెట్టాలని చూశారు


ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు. ఆనాడు ఉన్న పరిస్థితులు వేరు. అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు. వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది. నేను జగన్కు తోడబుట్టిన చెల్లెల్ని. ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. నాకు మద్దతు పలికిన వాళ్లను బెదిరించారు. రాజకీయంగా నా వాళ్లు రానివ్వకుండా చేశారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టడంలో జగన్కు ఏ సంబంధం లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశారు. నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశారు. నా ప్రతి పోరాటానికి అడ్డుపడ్డారు." అని షర్మిల అన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1936 : రష్యన్ రచయిత మాక్సిం గోర్కీ మరణం (జ.1868).
- 1929 : పండితుడు, కవి, విమర్శకుడు వేదం వేంకటరాయ శాస్త్రి మరణం (జ.1853).
- 1953 : స్వాతంత్ర్య సమరయోధురాలు పాలకోడేటి శ్యామలాంబ మరణం (జ.1902).
- 1983 : ప్రపంచకప్ క్రికెట్ లో కపిల్ దేవ్ జింబాబ్వే పై 175 పరుగులు సాధించి ఒక రోజు క్రికెట్‌లో భారత్ తరఫున తొలి శతకాన్ని నమోదుచేశాడు.
- 1986 : సాహితీవేత్త, పరిశోధకుడు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం మరణం (జ.1908).
- 2006 : మొదటి కజక్ దేశపు ఉపగ్రహం 'కజ్ శాట్' ప్రయోగించారు.
- 1912 : శాస్త్రీయరంగాలలో పి.హెచ్.డి పొందిన మొట్టమొదటి మహిళగా పేరుపొందిన భారతదేశానికి చెందిన జీవరసాయన శాస్త్రవేత్త కమలా సొహోనీ జననం (మ.1998). (చిత్రంలో)


ఆడం స్మిత్


చిత్తరంజన్ దాస్


ఆచంట జానకీరాం


ప్రఫుల్ల చంద్రరాయ్


వాలెంతినా తెరిష్కోవా


ఆర్య అంబేద్కర్


మల్లాది రామకృష్ణశాస్త్రీ

రిపబ్లిక్ స్పోర్ట్స్

# రోహిత్ శర్మ సరసన గ్లెన్ మాక్స్‌వెల్!

మేజర్ లీగ్ క్రికెట్ 2025లో భాగంగా లాస్ ఏంజెలెస్ నైటైడర్స్తో జరిగిన మ్యాచ్లో ఆస్ట్రేలియన్ ఆల్ రౌండర్ మ్యాకె వెల్ వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు తరఫున ఆడాడు. ఈ మ్యాచ్లో కేవలం 49 బంతుల్లో 106 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.




మేజర్ లీగ్ క్రికెట్ 2025లో లాస్ ఏంజెలెస్ నైటైడర్స్తో జరిగిన మ్యాచ్లో ఆస్ట్రేలియన్ ఆల్రౌండర్ మ్యాక్స్వెల్ వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు తరఫున ఆడాడు. ఈ మ్యాచ్లో కేవలం 49 బంతుల్లో 216.33 స్ట్రైక్రేట్తో 106 పరుగులతో నాటౌట్గా నిలిచాడు. ఇందులో 2 ఫోర్లు, 13 సిక్సులున్నాయి. ఇది మాక్స్వెల్కు పొట్టి ఫార్మాట్లో ఎనిమిదో శతకం. ఈ సెంచరీతో అతడు టీ20 క్రికెట్లో అత్యధిక సెంచరీలు కొట్టిన బ్యాటర్లలో నాలుగో స్థానంలో రోహిత్ శర్మ, జోస్ బట్లర్, అరోన్ ఫించ్, డేవిడ్ వార్నర్ సరసన నిలిచాడు. మ్యాక్స్వెల్ టీ20ల్లో 10,500 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. అలాగే 178 వికెట్లు కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. పొట్టి ఫార్మాట్లో 10,500 పరుగులు, 170 ప్లస్ వికెట్లు, అయిదు కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన తొలి ఆసిస్ క్రికెటర్గా నిలిచాడు. కాగా ఈ ఫార్మాట్లో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ 22 సెంచరీలు సాధించాడు. తర్వాతి స్థానంలో పాకిస్థాన్ క్రికెటర్ బాబర్ ఆజమ్ 11 శతకాలతో ఉన్నాడు. సౌతాఫ్రికా బ్యాటర్ రిలీ రోసోవ్, టీమ్ ఇండియా బ్యాటర్ విరాట్ కోహ్లి 9 సెంచరీలతో సంయుక్తంగా తర్వాతి స్థానంలో కొనసాగుతున్నారు. మేజర్ లీగ్ క్రికెట్లో వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుకు మాక్స్వెల్ కెప్టెన్గా వ్యవహరిస్తున్నాడు. గత సీజన్లో జట్టుకు కెప్టెన్గా టైటిల్ అందించిన స్టీవ్ స్మిత్ గైర్హాజరీలో అతడు సారథ్య బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. లాస్ ఏంజెలెస్ నైటైడర్స్‌తో జరిగిన మ్యాచ్లో మాక్స్వెల్ వీరవిహారం చేయడంతో వాషింగ్టన్ జట్టు 113 పరుగుల తేడాతో విజయం సాధించింది.

# నాగచైతన్యతో కలిసి ప్రమోషన్స్.. సమంత క్లారిటీ

నాగచైతన్య, సమంత కలిసి వర్క్ చేసిన చిత్రం 'ఏమాయ చేసావె'.
ఈ సినిమా రీ రిలీజ్ ప్రమోషన్స్‌ను ఉద్దేశించి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



నటుడు నాగచైతన్య, నటి సమంత కలిసి వర్క్ చేసిన చిత్రం 'ఏ మాయ చేసావె'. సుమారు 15 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం వచ్చే నెల 18న రీ రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే 'ఏ మాయ చేసావె' రీ రిలీజ్ ప్రమోషన్స్లో సామ్–చై కలిసి పాల్గొననున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఆయా వార్తలపై సమంత స్పందించారు. అందులో ఎలాంటి నిజం లేదని ఆంగ్ల వెబ్సైట్తో ఆమె చెప్పారు. ఇలాంటి వార్తలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నాయో తనకు తెలియడం లేదన్నారు. "చిత్రబృందానికి సంబంధించిన వ్యక్తులతో కలిసి నేను ఆ సినిమా ప్రమోట్ చేయడం లేదు. నిజం చెప్పాలంటే ప్రమోషన్స్కు దూరంగా ఉంటున్నా. ఇలాంటి వార్తలు ఎవరు కల్పిస్తున్నారో నాకు తెలియడం లేదు. ఆ సినిమాకు ఉన్న అభిమానులు నటీనటులు కలిసి ప్రమోట్ చేస్తే చూడాలనుకుని ఉండొచ్చు. ఏది ఏమైనా ప్రేక్షకుల దృష్టి కోణంపై ఒకరి జీవితం ఆధారపడి ఉండదు" అని ఆమె చెప్పారు. అనంతరం షూటింగ్ రోజులను గుర్తు చేసుకున్నారు. "నిజం చెప్పాలంటే నేను షూటింగ్లో పాల్గొన్న తొలి చిత్రం 'మాస్కోవెన్ కావేరి'. అందులో నా స్నేహితుడు రాహుల్ రవీంద్రన్ హీరోగా నటించాడు. ఆ సినిమాకు సంబంధించిన విషయాలు నాకు పెద్దగా గుర్తు లేవు. ఎందుకంటే తొలిరోజు షూట్ అయిన వెంటనే చాలా రోజులపాటు విరామం ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడో మొదలుపెట్టారు. దానివల్ల సినిమా విశేషాలు పెద్దగా గుర్తులేవు. నా రెండో చిత్రం 'ఏ మాయ చేసావె'కు సంబంధించిన అన్ని విషయాలు నాకు గుర్తున్నాయి. జెస్సీ–కార్తిక్లపై చిత్రీకరించిన ఇంటి గేటు సీన్ నా తొలి షాట్. కెరీర్ ఆరంభంలోనే దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్తో కలిసి వర్క్ చేసినందుకు ఎంతో సంతోషంగా అనిపించింది" అని ఆమె తెలిపారు. సమంత ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాతగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆమె నిర్మాతగా చేసిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'శుభం' ఇటీవల విడుదలై వినోదాన్ని పంచింది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఒకే కారులో విజయ్ దేవరకొండ, రష్మిక.. మరోసారి వార్తల్లో నిలిచిన జోడి

నటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక మరోసారి వార్తల్లో నిలిచారు.
ఈ జంటకు సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది.



'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఆన్‌స్క్రీన్ జోడీ విజయ్ దేవరకొండ, రష్మిక. వీరిద్దరూ రిలేషన్లో ఉన్నట్లు ఎంతో కాలం నుంచి వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ జోడీ మరోసారి హాట్ టాపిక్గా మారింది. ముంబయి విమానాశ్రయంలో వీరిద్దరూ కలిసి కనిపించారు. రష్మిక, విజయ్ ఒకే కారులో పక్కపక్కన కూర్చొని ప్రయాణించారు. ఈ దృశ్యాలను ఫొటోగ్రాఫర్లు క్లిక్మనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. దీంతో వీళ్లు రిలేషన్లోనే ఉన్నారనే వార్తలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. వీరిద్దరూ వారి సినిమాల విడుదలకు ముందు ఒకరికొకరు అభినందించుకుంటుంటారు. రష్మిక నటించిన 'కుబేర' విడుదలకు సిద్ధం కావడంతో విజయ్ ఆమెకు ఆల్ ది బెస్ట్ చెబుతూ తాజాగా పోస్ట్ పెట్టారు."కుబేర టీమ్కు శుభాకాంక్షలు. నా కెరీర్లో దర్శకుడు శేఖర్ కమ్ములకు ప్రత్యేక స్థానం ఉంటుంది. నాలాంటి ఎంతో మంది నటుల ఆశలను ఆయన నిజం చేశారు. నా అభిమాన తారలు నటించిన ఈ సినిమాను బిగ్‌స్క్రీన్‌పై చూడడం కోసం ఆసక్తిగా ఉన్నాను" అని పోస్ట్ పెట్టారు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్డమ్'తో బిజీగా ఉన్నారు. దీనితో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్గా రానున్న ఈ సినిమాలో రష్మిక కథానాయికగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే ముచ్చటగా మూడోసారి ఈ జోడీని చూడొచ్చని సంబరపడుతున్నారు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/161/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## ఆరోగ్యం


# పొరపాటున కూడా కొందరు నిమ్మకాయ నీళ్ల ఎట్టి పరిస్థితుల్లో తాగకూడదు, ఎవరు దూరంగా ఉండాలో తెలుసా?

ఈ రోజుల్లో చాలా మంది ఉదయాన్నే నిమ్మరసం తాగుతున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావిస్తున్నారు. అయితే, కొందరు నిమ్మరసం తాగకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

కరోనా తర్వాత చాలా మంది తమ జీవనశైలిలో మార్పులు చేసుకుంటున్నారు. ఆరోగ్యంగా ఉండటం కోసం చాలా మంది నిమ్మరసం అంటే నిమ్మకాయ నీటిని ఉదయాన్నే తాగడం అలవాటు చేసుకున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇందులో విటమిన్-సి ఉంటుంది. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. బరువు తగ్గడానికి కూడా సాయపడుతుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో చాలా మంది నిమ్మకాయ నీళ్లు తాగడం అలవాటు చేసుకున్నారు. అయితే, దీన్ని తాగడం వల్ల కొందరి ఆరోగ్యానికి హాని కలుగుతుంది. పలు అధ్యయనాలు, నిపుణుల ప్రకారం నిమ్మకాయ నీళ్లు ఎవరు తాగకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.




### అసిడిటీ సమస్యలు




యాసిడ్ రిఫ్లక్స్ (గుండెల్లో మంట), గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి, పెప్టిక్ అల్సర్ ఉన్నవారు నిమ్మరసం తాగకూడదు. నిమ్మకాయలో సిట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపులో యాసిడ్ ఉత్పత్తిని పెంచి, గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్, కడుపు నొప్పిని మరింత తీవ్రతరం చేస్తుంది. ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల ఎసిడిటీ సమస్య మరింత పెరుగుతుంది. అందుకే ఇలాంటి నిమ్మరసం తాగడానికి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

### దంత సమస్యలున్నవారు



ఎనామెల్ బలహీనపడినవారు లేదా దంత సున్నితత్వం ఉన్నవారు నిమ్మరసానికి దూరంగా ఉండాలని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. నిమ్మకాయలోని సిట్రిక్ యాసిడ్ దంతాలపై ఉండే ఎనామెల్‌ను బలహీనపరుస్తుంది. దీనివల్ల దంతాలు సున్నితంగా మారడం, పసుపు రంగులోకి మారడం లేదా దంత క్షయం వంటి సమస్యలు రావచ్చు. నిమ్మరసం తాగిన తర్వాత నోటిని శుభ్రం చేసుకోవడం మంచిది.

### కిడ్నీ సమస్యలు ఉన్నవారు



ఈ రోజుల్లో చాలా మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు నిమ్మకాయ నీళ్లు తాగకూడదని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని అధ్యయనాల ప్రకారం, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగకూడదు. ఇలాంటి వారు నిమ్మరసం తాగితే కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. ఎందుకంటే నిమ్మకాయ నీటిలో ఆక్సలేట్ అధికంగా ఉంటుంది.

### కీళ్ల నొప్పులు ఉన్నవారు



కీళ్ల నొప్పులు ఉన్నవారు కూడా నిమ్మకాయ నీటిని చాలా పరిమిత పరిమాణంలో తాగాలి. నిమ్మకాయలో ఉండే యాసిడ్ ఎముకలలో కాల్షియంను తగ్గించడం ప్రారంభిస్తుంది. దీని కారణంగా ఎముకలు బలహీనపడటం ప్రారంభమవుతాయి. దీంతో, మీ కీళ్ల నొప్పుల సమస్యలు మరింత పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

### వీళ్లు కూడా దూరంగా ఉండాలి



- తేనె కలిపిన నిమ్మరసం తాగేవారు జాగ్రత్తగా ఉండాలి. తేనెలో చక్కెర ఉంటుంది కాబట్టి, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది.
- నిమ్మరసం గొంతునొప్పిని మరింత పెంచవచ్చని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.
- బరువు తగ్గడం కోసం బారియాట్రిక్ సర్జరీ చేయించుకున్న వారు నిమ్మకాయ నీరు తాగకూడదు.
- నిమ్మకాయ నీరు సరైన పరిణామంలో తాగాలి. ఎక్కువ మోతాదులో తాగితే వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యుణ్ని సంప్రదించి తగిన సలహా తీసుకోవడం ముఖ్యం.



**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.